నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, శనివారం 11 జనవరి 2025 MAHABUBNAGAR NARAYANPET



నార్లాపూర్ రిజర్వాయర్ (ఫైల్)

# పాలమూరుకు ఎసరు!

## డిండికి నీళ్లిస్తే.. మనకు కన్నీళ్లే..

- పీఆర్ఎల్ఐ నీటిని డిండికి తరలించే కుట్ర
- ఉమ్మడి జిల్లాను ఎండబెట్టేందుకు యత్నం
- స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వైఫల్యం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఈ సారి నార్లాపూర్ రిజర్వాయర్‌కు చేరని చుక్క నీరు
- ఆందోళనలో కర్షకులు

మహబూబ్‌నగర్, జనవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్ ముఖ్యమంత్రిగా ఉన్నా.. ఎగువ పాలమూరుతోపాటు ప్రాజెక్టుల కోసం త్యాగం చేసిన కొల్లాపూర్ ప్రాంతం ఎడారిగా మారే పరిస్థితి నెలకొన్నది. 'వడ్డించేవాడు మన వాడు అయితే.. అఖరి బంతిలో కూర్చొన్న న్యాయం జరుగుతోంది'.. అని పాలమూరు వాసులు భావించారు. కానీ మహబూబ్‌నగర్ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వైఫల్యంతో కళ్ల ముందు నీళ్లు ఉన్నా రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. డిండికి పాలమూరు నీళ్లను ఎదుల రిజర్వాయర్ నుంచి తరలించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు చర్చ జోరందుకున్నది. దీంతో ఉమ్మడి జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'పాలమూరు'ను ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేసీఆర్ ఉమ్మడి జిల్లాను పూర్తిగా సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టింది. వలసలకు కేరాఫ్‌గా ఉన్న పాలమూరులో జలసిరులు కురిపించాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఎత్తిపోతల పనులను చేపట్టింది. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ వద్ద లిఫ్టులను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల 90 శాతం.. మరికొన్ని చోట్ల 95 శాతం పనులు తక్కువ కాలంలోనే పూర్తయ్యాయి. 2023 సెప్టెంబర్ 16న మొదటి రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్‌ను నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. తర్వాత పంపింగ్ కొనసాగడంతో 1/3 కృష్ణానీటిని ఎత్తిపోశారు. దీంతో నార్లాపూర్ రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకున్నది. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో అసెంబ్లీ ఎన్నికలు రావడం.. తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాలమూరు లిఫ్ట్‌పై వివక్ష చూపారు. దీంతో 'పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారయ్యాయి.

### వివక్ష చూపుతున్న ప్రభుత్వం

పాలమూరు లిఫ్ట్‌లో మిగిలిన పనులను పూర్తి చేస్తే ఎగువన ఉన్న రిజర్వాయర్లలోకి నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉండేది. తద్వారా ఉమ్మడి జిల్లాలోని రైతులకు పుష్కలంగా సాగునీళ్లను కూడా అందేవి. కానీ రేవంత్ సర్కారు ఏర్పాటై ఏడాది గడిచినా పనులు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కావాలనే వివక్ష చూపుతూ పనులు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల, పెద్దకొత్తపల్లి మండలం తీర్మానంపల్లి గ్రామాల మధ్య ప్రాజెక్టు ప్రధాన కాల్వ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో నీళ్లు పారడం లేదు.. ఎగువ ప్రాంతానికి లిఫ్ట్ చేసే అవకాశం లేకుండాపోయింది. దీనికితోడు ఇక్కడి నుంచి తరలించాలని ప్రభుత్వం యోచిస్తున్నదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎదుల లిఫ్ట్ నుంచి డిండికి నీళ్లను తరలించేందుకు ఉన్న శ్రద్ధ ఎగువ పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడం లేదని కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నా సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్న సోయి లేదంటున్నారు.

### ముందుచూపు లేని ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం ఎండాకాలంలో సాగు, తాగునీటికి కష్టాలు ఏర్పడే అవకాశం ఉన్నది. 120 టీఎంసీలతో పాలమూరు జిల్లాలో దాదాపు 7 లక్షల ఎకరాలకు సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించడంతోపాటు తాగునీటి అవసరాలను తీర్చేందుకు పీఆర్ఎల్ఐ మొదటి ప్రాధాన్యతగా పనులు కొనసాగాయి. ఈ క్రమంలోనే గతేడాది మూడో వంతు నీళ్లను నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేశారు. నిబంధనల ప్రకారం ఈ ఏడాది కూడా మరో 1/3 నీటిని పంపింగ్ చేయాలి.. కానీ ప్రభుత్వం శ్రీశైలం ఖాళీ అవుతున్నా ఈ ఏడాది ఇప్పటి వరకు నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి చుక్క నీటిని పంపింగ్ చేయలేదు. సమైక్య పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఎంజీకేఎల్ఐకి శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం లేకుండా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మాత్రం పీఆర్ఎల్ఐ మొదటి రిజర్వాయర్ ద్వారా ఎంజీకేఎల్ఐకి సాగునీరు అందించేందుకు పనులను పూర్తి చేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు త్యాగం చేసిన ప్రాంతానికి సాగునీరు అందించకుండా ఎసరు పెట్టేందుకు సిద్ధమైందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.




నార్లాపూర్ వద్ద పీఆర్ఎల్ఐ డెలివరీ సిస్టర్న్

### రైతులను ఇబ్బంది పెట్టొద్దు



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి ముఖ్యంగా కొల్లాపూర్ రైతులు భూములు అందించారు. ఇక్కడి రైతులకు పీఆర్ఎల్ఐ కేటాయింపులు లేకున్నా తాను ప్రత్యేక చొరవతో అప్పటి ముఖ్యమంత్రితో మాట్లాడి మొదటి రిజర్వాయర్ ద్వారా ఎంజీకేఎల్ఐకి నీటి కేటాయింపులు చేపట్టేలా చూశాం. కానీ ఇప్పటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో చుక్క నీటిని కూడా మొదటి రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేయలేదు.. సరికదా డిండికి పాలమూరు నీటిని తరలించే కుట్ర చేస్తున్నారు. కూత వేటు దూరంలో కృష్ణానది ఉన్నా సాగునీరు అందని కొల్లాపూర్ పరిసర ప్రాంతాలకు నీళ్లిచ్చేలా జీల్దార్‌తిప్ప, వీరనాయిని చెరువులకు నదీ జలాలను తరలింపుపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. లేకుంటే ప్రజలు, రైతుల దృష్టిలో చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయం.

*- బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే*





వనపర్తిలో పూజలు నిర్వహిస్తున్న నిరంజన్‌రెడ్డి, పాలమూరులో వెంకన్న ఆలయంలో శ్రీనివాస్‌గౌడ్

# ముక్కోటి.. జనకోటి

- వైభవంగా 'వైకుంఠ' వేడుకలు
- తిలకించి పులకించిన భక్తజనం
- ఉమ్మడి జిల్లాలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- పూజలు చేసిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జనవరి 10 : గోవింద నామస్మరణతో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రతిధ్వనించింది. ముక్కోటి ఏకాదశి వేడుకలు అంబరాన్నంటాయి. శుక్రవారం వేకువ జామున 4 గంటల నుంచే దర్శన భాగ్యం కల్పించడంతో శ్రీవారిని ఉత్తర ద్వారం మీదుగా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. తిలకించి భక్తజనం పులకించిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వట్టెం, పాలెం, శ్రీపురం, వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్, జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉత్తనూరు, పాలమూరులోని సింహగిరి, కాటన్‌మిల్ వెంకన్న ఆలయంతోపాటు జిల్లాలోని కురుమూర్తి, మన్యంకొండ, గంగాపురం, నారాయణపేట జిల్లాలోని వైష్ణవాలయాలన్నీ కిటకిటలాడాయి. వేద మంత్రోచ్ఛరణలతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

### దర్శించుకున్న మాజీ మంత్రులు

మహబూబ్‌నగర్/వనపర్తి టౌన్, జనవరి 10 : ముక్కోటి ఏకాదశి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డు ఉన్న వేంకటేశ్వర స్వామిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ దర్శించుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని భగవంతుడిని వేడుకున్నారు. తిరుమల ఘటన బాధాకరమని, మళ్లా ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. అలాగే వనపర్తి జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న విఠలేశ్వర పాండురంగస్వామి ఆలయంలో గులాబీ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.




అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

# మా గోడు అసెంబ్లీలో వినిపించరూ..

- ఎమ్మెల్యే విజయుడుకు ఆశ కార్యకర్తల వినతి
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్న ఎమ్మెల్యే

అలంపూర్, జనవరి 10 : చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవడం కష్టమైంది.. అసెంబ్లీలో మా బాధలు చెప్పి వేతనాలు పెంచడంతోపాటు మా సమస్యలు పరిష్కరించేలా చూడండి సారూ అంటూ ఆశ కార్యకర్తలు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకి తమ బాధలను మొరపెట్టుకున్నారు. శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశకార్యకర్తలు మాట్లాడుతూ ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. నెలకు రూ.18 వేల వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



రాజోళి బండ డైవర్షన్ స్కీం ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

# అడుగంటిపోతున్న ఆర్డీఎస్

అయిజ, జనవరి 10 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం క్రమేపీ అడుగంటిపోతున్నది. ఎగువ నుంచి రీ జనరేటర్ నీళ్లు ఆర్డీఎస్ ఆనకట్టకు నిలిచిపోవడంతో ఇన్‌ఫ్లో చేరడం లేదు. శుక్రవారం ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 185 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 87 క్యూసెక్కులు ఆర్డీఎస్ కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ గుండా దిగువకు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం 5 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటి నిల్వలు పడిపోతున్నాయని, టీబీ డ్యాం నుంచి విడుదల చేసిన నీరు చేరితేనే ఆర్డీఎస్ ప్రధానకాల్వకు నీటి విడుదల పెంచుతామని ఆయన పేర్కొన్నారు. కాగా, కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 9,392 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠసామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 73.907 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# కల్తీ ఆహార పదార్థాల విక్రయ ముఠా అరెస్టు

- ఐదుగురిపై కేసు, ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ శ్రీను

గద్వాల అర్బన్, జనవరి 10 : కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ముఠా పట్టుబడిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని టౌన్ పీఎస్‌లో సర్కిల్ సీఐ శ్రీను వెల్లడించారు.

రెండ్రోజుల కిందట బొలేరో వాహనంలో ఇద్దరు అల్లం, కారం, వెల్లుల్లి, ఇతర ఆహార పదార్థాలను గద్వాలలోని హోల్‌సేల్ షాపులకు సరఫరా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో టౌన్ ఎస్సై కళ్యాణ్‌కుమార్ సిబ్బందితో తనిఖీ చేయగా.. కల్తీ ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. వివరాలు ఆరా తీశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, అలాగే నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామానుజపురంలోని ఇండస్ట్రీయల్ కంపెనీలలో కల్తీ పదార్థాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడ తయారైన పదార్థాలను తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వీరి నుంచి పెద్ద మొత్తంలో కల్తీ ఆహార పదార్థాలను, డబ్బును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాన్‌గల్ మండలం కదిరెపాడుకు చెందిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామానుజపురానికి చెందిన యాస సుధాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవ్వాడిపల్లిగ్రామానికి చెందిన జపాల శివ, హైదరాబాద్ కాటేదాన్‌కు చెందిన ఇక్బాల్, గద్వాలకు చెందిన ఖాజా హమీర్‌పై కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

# పట్టాలివ్వండి సారూ..

- 150 ఏండ్లుగా సాగు చేస్తున్నాం
- పట్టా లేక పరేషాన్ అవుతున్నాం
- ప్రభుత్వ పథకాలను నోచుకోవడం లేదు
- గతంలో ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయండి
- 8 గిరిజన తండాల రైతుల ఆవేదన
- ఆర్డీవో కార్యాలయానికి 25 కిలోమీటర్ల పాదయాత్ర
- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు



తండాల నుంచి వనపర్తికి పాదయాత్రగా వస్తున్న గిరిజన రైతులు

వనపర్తి, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను అమలు చేసి 150ఏండ్లుగా తాము సాగు చేస్తున్న వ్యవసాయ భూములను తమ పేరున పట్టాలు చేయాలని 8తండాలకు చెందిన గిరిజన రైతులు శుక్రవారం వారి తండాల నుంచి వనపర్తి ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఖిల్లాఘణపురం మండలం వెనకితండా, ముందరి తండా, మేడిబాయి తండా, బక్కతండా, కర్నెతండా, ఆముదాలబండ తండాలతోపాటు బిజినేపల్లి మండలం భీముని తండా, మిట్టతండాలకు చెందిన గిరిజన రైతులు మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 24 కిలోమీటర్ల మేర తమకు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పట్టాలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని మొరపెట్టుకున్నారు. కొన్ని దశాబ్దాలపాటు తాము సాగు చేస్తున్న భూములు రాజాబహదూర్ కరణ్‌చంద్, శ్యాంకరణ్ అనే వారి పేరిట ఉన్నాయని, ఇప్పటి వరకు తామే ఈ భూములను సాగు చేసుకొని బతుకుతున్నామన్నారు. ఈ భూములు మినహాయిస్తే బతుకులేదని, ఈ విషయాన్ని గతంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కూడా తీసుకెళ్లామన్నారు. ఎలాంటి ఆధారం లేని గిరిజన కుటుంబాల పంట నష్టం, రైతు భరోసా, పంట బీమాలాంటి ప్రభుత్వ పథకాలేవీ అందడం లేదని, దీన్ని పరిగణలోకి తీసుకొని 2019లో అప్పటి కలెక్టర్‌కు తమ సమస్యను వివరించగా, సీసీఎల్ఏకు పంపడం జరిగిందన్నారు. అనంతరం స్థానిక తాసీల్దార్‌తో విచారణ జరిపించి పూర్తి స్థాయి రిపోర్టును ప్రభుత్వానికి పంపించారన్నారు. అయితే, 2022లో ఆర్డీవో ద్వారా రికార్డులో ఉన్నవారికి సమాచారం తెలియజేయడం, 50 ఎకరాలకు పైబడి ఉంటే సీలింగ్ యాక్టు పరిధిలోకి వస్తుందని రాజవంశీయులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం అప్పటి కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ల్యాండ్ సీలింగ్ యాక్టు ప్రకారం సాగులో ఉన్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని డిక్లరేషన్ ఇచ్చినట్లు గిరిజన రైతులు పేర్కొన్నారు. అయితే, ఇప్పటి వరకు ఆ ఉత్తర్వులను అమలు చేయకుండా గిరిజన రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. రైతుల పాదయాత్రకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు, ఆంజనేయులు, రాజు, అజయ్ మాట్లాడుతూ.. రాజవంశస్తుల పేరును తొలగించి సాగులో ఉన్న గిరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందించగా, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

కార్యక్రమంలో నందిమల్ల అశోక్, జాత్రు నాయక్, పద్మ, నిక్సన్, పరమేశ్వర్, బాల్యా నాయక్, పీన్యా నాయక్, సక్రూ నాయక్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# ఈజీ మనీ కోసం కిడ్నాప్

- శాంతినగర్ వ్యాపారీ కేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్ట్
- 7 సెల్‌ఫోన్లు, రూ.50వేల నగదు స్వాధీనం

వడ్డేపల్లి, జనవరి 10 : సులభంగా డబ్బు సంపాదించాలని నలుగురు యువకులు ఒక వ్యాపారిని కిడ్నాప్ చేయగా, ఫోన్ ట్రేసింగ్ ద్వారా 8గంటల్లో గుర్తించి కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని క్షేమంగా ఇంటికి చేర్చామని సీఐ టాటా బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు శాంతినగర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శాంతినగర్‌కు చెందిన సెల్‌ఫోన్ షాపు యజమాని భూపాల్, హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ, కలుకుంట్లకు చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ అలీ (రఫీ), శాంతినగర్‌కు చెందిన సెల్‌ఫోన్ మెకానిక్ సతీశ్ నెలరోజుల నుంచి కిడ్నాప్‌కు ప్లాన్ చేశారన్నారు. హైదరాబాద్‌లోని అపార్ట్‌మెంటులో గదిని అద్దెకు తీసుకొని శాంతినగర్‌కు చెందిన కిరాణ వ్యాపారి రమేశ్‌బాబుకు ఫోన్ చేసి నీకు గతంలో బాకీ ఉన్న రామయ్య బంధువును మాట్లాడుతున్నానని, హైదరాబాద్‌కు వస్తే డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికారు. దీంతో రమేశ్‌బాబు హైదరాబాద్‌కు వెళ్లాడు. ముఖానికి మాస్కులు వేసి అతడిపై దాడిచేసి కాళ్లు, చేతులు కట్టేసి గదిలో బంధించారు. చిత్రహింసలకు గురిచేసి రూ.10పదిలక్షలు కావాలని డిమాండ్ చేశారు. రమేశ్‌బాబుతో ఒక వ్యక్తికి ఫోన్ చేయించి డబ్బులు అడిగించారు. ఈ విషయం రమేశ్‌బాబు భార్య సుభాషిణికి తెలిసి ఈనెల 6వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సంతోశ్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి రమేశ్‌బాబు ఫోన్ ట్రేసింగ్ చేసి హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి కానిస్టేబుళ్లను పంపారు. కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని క్షేమంగా ఇంటికి చేర్చారు. కిడ్నాప్ చేసిన నలుగురు బెంగుళూరు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, వారిని గురువారం సాయంత్రం అలంపూర్ చౌరస్తాలో పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ మేరకు రిమాండ్‌కు పంపుతున్నట్లు సీఐ టాటాబాబు తెలిపారు. కిడ్నాపర్ల నుంచి 7 సెల్‌ఫోన్లు, రూ.50వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన పోలీస్ టెక్నికల్ టీమ్‌తోపాటు ఎస్సై సంతోశ్, కానిస్టేబుళ్లు రఘు, రబీ రసూల్‌ను సీఐ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌కుమార్, మస్తాన్ పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతుండయ్..

- మోటర్లు ఆన్ చేసి నీళ్లివ్వండి
- తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద రాజోళి రైతుల ఆందోళన

రాజోళి, జనవరి 10 : నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి.. వెంటనే మోటర్లు ఆన్ చేసి నీళ్లు అందించాలని తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద రాజోళి మండల రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మిళ్ల లిఫ్ట్‌ను నమ్ముకొని యాసంగిలో పంటలు సాగు చేశామని, నీళ్లు లేక ఎండుముఖం పట్టాయని తెలిపారు. నీళ్లు విడుదల చేయకపోతే భారీగా నష్టపోవాల్సి వస్తుందని, అధికారులు స్పందించి పంటలను కాపాడాలని కోరారు. అధికారులు, సర్కారు స్పందించి వెంటనే నీళ్లు విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద రైతుల నిరసన

# హ్యాండ్‌బాల్ టోర్నీ ఆరంభం

- పాలమూరులో జాతీయ స్థాయి పోటీలు
- 36 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు
- వసతుల కల్పనపై అఫీషియల్స్ అభ్యంతరం
- నిర్వాహకులతో వాగ్వాదం

మహబూబ్‌నగర్, జనవరి 10 : పాలమూరు పట్టణంలోని స్టేడియం మైదానంలో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ అండర్-17 పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ క్రీడా జ్యోతిని వెలిగించగా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 36 జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదా బాయి, బాస్కెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు జాకీర్, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, ఎస్‌జీఎఫ్ ఫీల్డ్ ఆఫీసర్ దేవేందర్ స్వామి, టోర్నీ ఆర్గనైజర్ జీయావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వసతులపై నిర్వాహకులతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అఫీషియల్స్

### హోరాహోరీగా పోటీలు..

తొలిరోజు బాలికల విభాగంలో ఉత్తరప్రదేశ్ జట్టు 29-3 తేడాతో జార్ఖండ్‌పై, పంజాబ్ 23-01 ఎన్వీఎస్‌పై, గుజరాత్ 14-05 ఉత్తరాఖండ్‌పై, మధ్యప్రదేశ్ 22-06 విద్యాభారతిపై, బాలుర విభాగంలో డీ ఏవీ 17-16 తేడాతో మధ్యప్రదేశ్‌పై, ఢిల్లీ 26-07 పాండిచ్చేరిపై, ఎన్వీఎస్ 31-23 తేడాతో విద్యాభారతిపై, బీహార్ 24-09 ఉత్తరాఖండ్ జట్టుపై విజయం సాధించాయి.



జాతీయస్థాయి టోర్నీలో తలపడుతున్న యూపీ, జార్ఖండ్ బాలికల జట్లు

### వసతులపై నిరసన..

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, అఫీషియల్స్‌కు విడివిడిగా మైనార్టీ గురుకుల పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. బెడ్లు సరిగా లేవని, మూత్రశాలలు కంపు కొడుతున్నాయని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు మ్యాచ్‌ను నిలిపివేశారు.

పాఠశాలలకు నేటి నుంచి సెలవులు ఉన్నాయని, విద్యార్థులు వెళ్లిపోయాక గదులను శుభ్రం చేయిస్తామని నిర్వాహకులు సర్దిచెప్పారు.